

ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద మునిసిపాలిటీగా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహబూబాబాద్ మునిసిపాలిటీ 36 వార్డులతో అతిపెద్ద మునిసిపాలిటీగా కొనసాగుతోంది. పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆరు గ్రామాలను మునిసిపాలిటీలో విలీనం చేయగా, గతంలో 28 వార్డులున్న మునిసిపాలిటీ 36 వార్డులకు చేరుకుంది. జిల్లా కేంద్రంగా ఆవిష్కృతమైన మానుకోట పట్టణం రోజురోజుకు విస్తరించడంతో ప్రస్తుతం మునిసిపాలిటీ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం 62 వేల జనాభా ఉంది.



వానొస్తే.. వణుకే!

ఏటా మానుకోట పట్టణ ప్రజలకు తప్పని కష్టాలు

- భారీ వర్షాలు కురిస్తే.. రూ.కోట్లలో నష్టం
- ఇటీవల పడిన వానలతో దెబ్బతిన్న ప్రధాన రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు
- చెరువులు, కుంటల ఆక్రమణతో పట్టణం జలదిగ్బంధం
- తాత్కాలిక చర్యలే తప్ప.. శాశ్వత పరిష్కారమేది?
- హైడ్రా తరహాలో మాడ్రా తీసుకువస్తేనే జలాశయాలకు రక్షణ
- తక్షణ సాయంగా రూ.15 కోట్లు కేటాయించాలి సీఎంకు ఎమ్మెల్యే వినతి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 5 : వర్షాలు వస్తే.. మానుకోట పట్టణానికి కష్టాలు తప్పవా..? అన్న ప్రశ్నకు ఔననే సమాధానం వస్తోంది. ఎన్నడూలేని విధంగా ఇటీవల కురుస్తున్న వానలతో జిల్లా కేంద్రం జలదిగ్బంధంగా మారిపోయింది. తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా తర్వాత మహబూబాబాద్ జిల్లాలోనే అత్యధిక వర్షం కురవడంతో భారీ నష్టం వాటిల్లింది. దీంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రం చుట్టూ నీరు నిలవడంతో నిండుకుండలా మారి, చెరువులా కన్పించింది. లోతట్టు ప్రాంతాలే కాకుండా మానుకోట పట్టణంలోని పలు ప్రాంతాలు సైతం జలమయంగా మారిపోయాయి. ఎటు చూసినా వరద నీటి ప్రవాహమే కన్పించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

మునిసిపల్ పరిధిలోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు దెబ్బతిని రూ.కోట్లల్లో ఆస్తినష్టం జరిగింది. భారీ వర్షంతో జనం పడరాని కష్టాలు పడ్డారు. వర్షాలు పడ్డ సమయంలో తూతూ మంత్రంగా తాత్కాలిక చర్యలు చేపడుతున్నారే తప్ప, శాశ్వత పరిష్కారం చూపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చెరువులు, కుంటలు ఆక్రమణకు గురికావడంతో చెరువులో ఉండాల్సిన నీరు రోడ్డుపైకి రావడంతో మానుకోట పట్టణం జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. చుట్టూరా నీళ్లు నిలిచి వీధులన్నీ జలమయంగా మారడంతో రాకపోకలు స్తంభించి పోయాయి.హైడ్రా తరహాలో మాడ్రా తీసుకువచ్చి మానుకోట జిల్లా కేంద్రంలోని చెరువులను, కుంటలను రక్షించాలని స్థానిక శాసనసభ్యుడు భూక్య మురళీనాయక్ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాగా, మానుకోటలో భారీ వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లిందని తక్షణమే రూ.15 కోట్లు మంజూరు చేయాలని పట్టణానికి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి కోరారు.

వర్షకాలం అంటే భయం.. భయం..

వర్షాకాలం ఆరంభమవుతుందంటే చాలు.. పట్టణ ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన దైన్యస్థితి నెలకొంది. ఇక జిల్లా కేంద్రాన్ని ఆనుకుని ఉన్నశివారు కాలనీల ప్రజల పరిస్థితి దయనీయంగా మారు తోంది. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కాలనీల్లోనే నివాసముంటున్న నిరుపేదలు బిక్కుబిక్కు మంటూ జీవనం సాగించాల్సిన దైన్యస్థితి. ఇలా ప్రతీ సంవత్సరం వర్షాలతో పడరాని కష్టాలు పడుతున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం కురిసిన భారీ వర్షం మానుకోటను అతలాకుతలం చేసింది. ఊహించని విధంగా నష్టాన్ని మిగిల్చిపోయింది. అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు దెబ్బతిన్నాయి. కొన్ని కాలనీల్లో రోడ్లు బురదమయంగా మారిపోయాయి. మరికొన్ని కాలనీల్లో సైడ్ డ్రైనేజీ కాల్వలు లేని చోట ఇటు వర్షం నీరు.. అటు ఇళ్లలోని మురికినీరు రోడ్లపైకి చేరుతుంది. దీంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదమూ ఉంది. పాలకులు, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మానుకోట పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చెరువులు, కుంటల ఆక్రమణతో రోడ్లపైకి నీరు..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో దాదాపుగా 29 చెరువులుండేవి. దినదినాభివృద్ధి చెంది మానుకోట జిల్లా కేంద్రంగా ఆవిష్కృతం కావడంతో పట్టణం క్రమక్రమంగా పెరుగుతూ వస్తోంది ఈ క్రమంలో వ్యవసాయ సాగుభూమి తగ్గుతూ వస్తోంది. చెరువులు, కుంటలు సైతం ఆక్రమణకు గురవుతున్నాయి. జిల్లా కేంద్రాన్ని ఆనుకుని అనేక చెరువులు, కుంటలుండగా అందులో కొన్ని కనుమరుగు కాగా, ఉన్నవాటిలో కూడా కొన్నింటిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో చెరువులు, కుంటల విస్తీర్ణం తగ్గిపోయింది. గతంలో అనేక మార్లు జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సంబంధిత అధికారులతో సమీక్షలు చేపట్టి చెరువుల రక్షణ కోసం ఎఫ్‌టీఎల్ గుర్తించి హద్దులు కేటాయించాలని ఆదేశించినప్పటికి అధికారులు తూతూ మంత్రంగా సర్వేలు నిర్వహించి, మమా అనిపించారు. అయినా ఇప్పుడు చెరువుల్లో నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో వర్షం కురిసినప్పుడల్లా చెరువుల నీరంతా రోడ్లపైకి వస్తోంది. ఈ సంవత్సరం భారీ వర్షం కురవడంతో పట్టణం మొత్తం జలమయంగా మారిపోయి.. జిల్లా కేంద్రం నీటితో నిండుకుండలా కన్పించింది. ఆర్యూబీలో సైతం నీరు నిల్వడంతో కొత్తపాత బజారులకు కూడా కనీసం రాకపోకలు బంద్ అయ్యాయి. బంధం కుంట చెరువు నీటి ఉధృతి రోడ్డు పైకి రావడంతో చెరువు పక్కన, కురవి రోడ్‌లోని ఆర్వోబీ కింద రోడ్డు కోతకు గురైంది. అంతే కాకుండా ఇల్లందు బైపాస్ రోడ్డులో భారీగా నీరు నిలిచింది. ఇక నిజాం చెరువులోని నీరు సైతం ఈదులపూసపల్లి రోడ్‌పైకి చేరడంతో అటు కూడా పట్టణ జనజీవనం స్తంభించి పోయింది.



జలమయమైన మహబూబాబాద్-ఇల్లెందు బైపాస్‌రోడ్ (ఫైల్)



మానుకోట పట్టణంలో దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మురళీనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ (ఫైల్)



ఇటీవలి వర్షాలకు మహబూబాబాద్‌లో అనంతారం ట్రాక్ పక్కన ప్రవహిస్తున్న నీరు (ఫైల్)



మహబూబాబాద్ మున్నేరు వాగు వద్ద కొట్టుకు పోయిన రోడ్డు (ఫైల్)

హైడ్రా తరహాలో మాడ్రా వస్తేనే!

హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ కోసం రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన హైదరాబాద్ డిసాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) తరహాలో తరహాలో.. మానుకోట పట్టణంలో చెరువులు, కుంటలను రక్షించేందుకు మాడ్రాను తీసుకువస్తేనే చెరువులు, కుంటలకు రక్షణ ఉంటుంది. ఇప్పటికే ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఇటీవల ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద దేవాదుల ప్రాజెక్టును రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులు సందర్శించిన తరుణంలో మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. కాగా, మహబూబాబాద్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షానికి పట్టణంలో తీవ్రనష్టం జరిగిందని, డ్రైనేజీల నిర్మాణాలు, రోడ్ల మరమ్మతులు, నాలాల ఏర్పాటుకు తక్షణమే రాష్ట్రప్రభుత్వం రూ. 15 కోట్ల నిధులు కేటాయించి మంజూరు చేయాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఏది ఏమై నప్పటికి వర్షాలు కురిసిన సమయంలో ప్రతిసారి ఇబ్బందులు పడుతు న్నామని, తాత్కాలిక చర్యలు చేపట్టి వదిలేయకుండా పాలకులు, అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు వేడుకుంటున్నారు.



తాళ్లపూసపల్లి ప్రకృతి వ్యవసాయ శిక్షణలో మాట్లాడుతున్న నల్లు ఇంద్రసేనారెడ్డి

ప్రకృతి వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సాహం

- ఈ విధానంలో సాగు కోసం రూ.1500 కోట్లు కేటాయింపు
- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి
- కేసముద్రంలో సదస్సుకు హాజరు



వ్యవసాయ డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఇంద్రసేనారెడ్డి

వివరాలు 7లో..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యలమంచిలి వెంకటేశ్వర్‌రావు

నేడు ఎంపీ ఈటల పర్యటన



- జిల్లాలో భారీ వర్షాలకు నష్టపోయిన బాధితులను పరామర్శించనున్న రాజేందర్
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు

మహబూబాబాద్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ పర్యటించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మానుకోటలోని జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన బాధితులను పరామర్శించనున్నట్లు చెప్పారు. హైదరాబాద్ నుంచి నేరుగా ములుగు జిల్లా తాడ్వాయి మండలకేంద్రానికి చేరుకుని, అక్కడ పర్యటించి అనంతరం పాకాల కొత్తగూడ మీదుగా మహబూబాబాద్ జిల్లా పార్టీ కార్యాలయానికి మధ్యాహ్నం ఒంటిగంటకు చేరుకుంటారని చెప్పారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఈటల రాజేందర్ పాల్గొంటారని పేర్కొన్నారు. మరిపెడ మండలం పురుషోత్తమయగూడెం శివారు కోతకు గురైన బ్రిడ్జి, రోడ్డును పరిశీలించనున్నట్లు చెప్పారు. నెల్లికుదురు మండలం రావిరాల గ్రామానికి చేరుకుని, అక్కడి బాధితులను పరామర్శిస్తారని తెలిపారు. అక్కడ్నుంచి ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారంతండాకు వెళ్లి యువశాస్త్రవేత్త నూనావత్ అశ్విని, తండ్రి మోతీలాల్ కుటుంబాన్ని పరామర్శించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాదవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మోసంగి మురళి, ధర్మారపు వెంకన్న, జిల్లా అధికార ప్రతినిధి దార ఇందుభారతి, జిల్లా కార్యదర్శి బానోత్ శ్రీను, రవీందర్‌రెడ్డి, గుండగాని భరత్‌కుమార్, మేరుగు యాకన్న, వశిష్ట పాల్గొన్నారు.

వర్షాలతో విద్యుత్‌శాఖకు భారీ నష్టం

- చీఫ్ ఇంజనీర్ కెన్ గుట్ట

వివరాలు 8లో..

సర్వేపల్లి జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం



- సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైంది
- ఎంపీ పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం భవిష్యత్‌తరాలకు స్ఫూర్తిదాయకమని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 10మందిని పుష్పగుచ్ఛాలు అందిజేసి, శాలువాలు కప్పి, మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన రాధాకృష్ణన్ దేశ తొలి ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా పదవులు చేపట్టి ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని,అలాంటి వృత్తిని నిర్లక్ష్యం చేయకుండా విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు.



గురుపూజోత్సవ కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీ బలరాంనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పొ, డేవిడ్

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా ఉంటూ విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఫలితాలే కాకుండా విలువలతో కూడిన విద్యనందించాలన్నారు. రాష్ట్రంలో పది ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

అదనపు కలెక్టర్ డేవిడ్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే సంస్కారవంతమైన విద్యనందించాలని, అంకితభావతో విధులు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాటుపడాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు బడుగు, బలహీనవర్గాల పిల్లలే ఎక్కువగా ఉంటారని వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు విద్యార్థులకు మార్గదర్శిగా ఉంటూ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో 90,991 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. గత పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా 12వ స్థానంలో ఉన్నట్లు పేర్కొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు పూల్‌చంద్, రాము, శ్రీదేవి, ఎంఎన్‌వోలు మహంకాళి బుచ్చయ్య, ఇస్లావత్ లచ్చిరాంనాయక్, వెంకటేశ్వర్‌రావు, లక్ష్మా, రవికుమార్, శ్రీనివాస్, ఏసీజీఈ మందుల శ్రీరాములు, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, జీసీడీవో విజయకుమారీ, క్వాలీటి ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ ఆజాద్ చంద్రశేఖర్, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ పూర్ణచందర్, సూపరింటెండెంట్‌లు ఉమామహేశ్వర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

మరిపెడ రూరల్, సెప్టెంబరు 5 : భారీ వర్షాలకు అతలాకుతలమైన సీతారాంతండా గిరిజనులకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ పేర్కొన్నారు. గురువారం సీతారాంతండా గిరిజనులకు నిత్యావసర సరుకులను (10 రకాల) పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ ఇంటింటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వరదలకు భారీగా నష్టపోయిన మండలంలోని సీతారాంతండా, భూక్యాతండా, బాల్ని ధర్మారం, పురుషోత్తామాయగూడెం, బీచ్‌రాజ్‌పల్లి, ఉల్లేపల్లి వాసులు కేవలం కట్టుబట్టలతోనే ఉండడం బాధాకరమన్నారు. వరదలతో నష్టపోయిన గిరిజనులకు సీఎం రేవంత్‌రెడ్డి కేవలం రూ.10 వేలు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన సహాయాన్ని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుడితి మహేందర్‌రెడ్డి, గంధశిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీతారాం తండాలో నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న సత్యవతి రాథోడ్

'సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

తొర్రూరు, సెప్టెంబరు 5 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వస్తున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి మురళీధర్‌రావు అన్నారు. గురువారం తొర్రూరులోని జంగాల బజార్‌లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని సందర్శించి, పలుసూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచుతున్నామని, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఎక్కడ నిర్లక్ష్యం వహించబోమని తెలిపారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జ్వలిత, వైద్యసిబ్బంది ఉన్నారు.



అయోధ్యలో తెగిన చెరువు కట్టను పరిశీలిస్తున్న తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలి

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 5 : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటనష్టపోయిన ప్రతీ రైతులకు నష్టపరిహారం అందించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మండలం ఆయోధ్యలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిన పెద్దబంధం చెరువు కట్టను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో పెద్దబంధం చెరువు కట్టకు గండి పడడంతో దాని పరిధిలోని వరి, ఇతర పంటలు కొట్టుకుపోయాయని చెప్పారు. వరద ధాటికి కొట్టుకుపోయిన పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తేళ్ల శ్రీనివాస్, జెరిపోతుల వెంకన్న, మంగళంపల్లి కన్నా, బానోత్ రవికుమార్, మార్నేని రఘు, దౌలగర్ శంకర్, మాజీ సర్పంచ్ దుండి శ్రీనివాస్, మడత వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

బయ్యారం, సెప్టెంబరు 5 : వరద బాధితులకు గురువారం పోలీసులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని వట్టివాగు ప్రవాహంతో మొట్లతిమ్మాపురం గ్రామానికి వారం రోజులుగా రాకపోకలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో ఎస్పీ ఎస్పీ సుధీర్‌రామ్ నాథ్ కేకన్ ఆదేశాలతో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి నేతృత్వంలో బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతితో పాటు పోలీస్ సిబ్బంది జేసీబీ వాహనం ద్వారా వాగుదాటి మొట్లతిమ్మాపురం గ్రామ ప్రజలకు నిత్యావసర సరుకులు, కురగాయలు పంపిణీ చేశారు. దాదాపు ఒక ట్రాక్టర్ నిండా సరుకులు తీసుకెళ్లి గ్రామ ప్రజలకు అందజేశారు. కొద్ది రోజులుగా తాము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పోలీసులు సరుకులు పంపిణీ చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అనిల్, సతీష్, రజిని, కోటేశ్వర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


బయ్యారంలో బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న పోలీసులు


వరంగల్ పోతననగర్‌లోని మోడ్రన్ దోబీఘాట్


వాషింగ్ మిషన్లు, ఐరన్ బాక్స్ టేబుల్స్

మోడ్రన్ దోబీఘాట్‌పై పట్టింపేదీ?

- నిరుపయోగంగా పోతననగర్ దోబీఘాట్
- కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యం
- నిరుపయోగంగా విలువైన సామగ్రి
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం
- నిర్వహణ బాధ్యతపై ఎటూ తేల్చని అధికారులు
- రజక సంఘాలకు అప్పగించాలని డిమాండ్


ల్యాండ్రోమార్ట్ పనులను ప్రారంభిస్తున్న కేటీఆర్, అధికారులు (ఫైల్)

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 5: అట్టహాసంగా ప్రారంభించిన వరంగల్ మోడ్రన్ దోబీఘాట్(ల్యాండ్రో మార్ట్) పది నెలలకే పనులకు నోచుకోకుండా పోయింది. పనులు మొత్తం పూర్తయినా బల్దియా, బీసీ వెల్ఫేర్ శాఖల మధ్య నెలకొన్న సమన్వయ లోపంతో ఎక్కడి పనులక్కడే అన్నట్టు విమర్శలు వస్తున్నాయి.

అధునాతన రీతిలో..

వరంగల్ పోతననగర్‌లో ఏర్పాటు చేసిన మోడ్రన్ దోబీఘాట్ అధునాతన సాంకేతికతతో రూపుదిద్దుకుంది. స్మార్ట్‌సిటీ నిధుల కింద ముందుగా రూ.1.10 కోట్లు మంజూరు చేయగా, తర్వాత మరో రూ.కోటితో షెడ్డుతో పాటు అక్కడ అన్ని సౌకర్యాలు, ప్రత్యేక పవర్ ట్రాన్స్‌ఫార్మ్‌ను ఏర్పాటు చేశారు. పోతననగర్‌లో ఏర్పాటు చేసిన మోడ్రన్ దోబీఘాట్‌కు ఇప్పటి వరకు రూ.2.50 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు బల్దియా అధికారులు వెల్లడించారు. అందులో 30కిలోల వాషింగ్ మిషన్లు 9, 15కిలోల స్పిన్ మిషన్లు 9, 30కిలోల డ్రై మిషన్లు 12, 10 టేబుళ్లపై ఆర్‌వో స్ట్రీం వాటర్ టెక్నాలజీతో నడిచే 10 ఐరన్ బాక్సులతో పాటు పెద్ద పెద్ద టబ్బులు, కెమికల్ స్టోరేజ్ మిషన్లను ఏర్పాటు చేశారు. ఇంకా మోడ్రన్ దోబీ మిషన్లు, శారీ రోలింగ్ మిషన్లు, బెడ్‌షీట్ ఏరన్ మిషన్లు ఏర్పాటు చేశారు. ఈ మిషన్ల ద్వారా డ్రైక్లీనింగ్, డ్రైవాష్, స్ట్రీం ఐరన్ వాష్, నార్మల్ వాష్, స్పిన్ వాష్, కెమికల్ వాష్, నాచురల్ వాష్‌ల పద్ధతిలో అన్ని రకాల బట్టలు శుభ్రం చేయవచ్చని తెలిపారు.

ఏకతాటిపైకి కుల సంఘం నాయకులు

వరంగల్ నగరంలో రజకుల అభివృద్ధి కోసం మోడ్రన్ దోబీఘాట్ ఏర్పాటు చేస్తున్నారని, ఇందులో రజకులైన ప్రతీ ఒక్కరు సభ్యులుగా ఉండవచ్చని ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు తెలిపారు. ముందుగా ప్రాంతాల వారీగా ఉన్న రజక సంఘాల నాయకులను ఏక తాటిపైకి తెచ్చి తర్వాత వరంగల్ ట్రైసిటీస్ సమావేశం ఏర్పాటు చేశారు. సుమారు 500 నుంచి 600 మంది వరకు సభ్యులుగా చేర్చుకుని మడేలయ్య మోడ్రన్ దోబీఘాట్ సొసైటీగా ఏర్పడ్డారు. ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఒకరికొకరు చేరవేసుకుంటున్నారు. బస్వరాజు సారయ్యను సంఘానికి ముఖ్య సలహాదారుడిగా చేసుకుని, ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘాల నుంచి ఇద్దరు, ముగ్గురి చొప్పున తీసుకుని పెద్ద సంఘంగా ఏర్పడ్డారు. అయితే వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో నివసించే రజక కార్మికులు.. చేసిన పనికి తీసుకునే ధరలు విషయంలో కొంత వ్యత్యాసం ఉండడంతో కొందరు వెనక్కి తగ్గినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో అధికారులు సైతం ముందుకు రావడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా పక్కన పెడితే తక్కువ సమయంలో ఎక్కువ బట్టలు ఉతకడం, ఇస్త్రీ చేయడం, డ్రైక్లీనింగ్‌తో రజకులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అట్టహాసంగా..

2021లో వరంగల్ నగరంలో మోడ్రన్ దోబీఘాట్‌నే ఏర్పాటు చేసేందుకు సంఘం ప్రతినిధులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2022లో పనులు ప్రారంభమయ్యాయి. స్మార్ట్‌సిటీ ప్రత్యేక నిధులతో వరంగల్ పోతననగర్‌లో ల్యాండ్రో మార్ట్ (దోబీఘాట్) పనులు పూర్తి చేశారు. కాగా, పోతననగర్‌లోని దోబీఘాట్‌తో పాటు అలంకార్ జంక్షన్‌లో అభివృద్ధి పనులు, పాత సెంట్రల్ జైలు ముందు లైబ్రరీ, చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను 2023 అక్టోబరు 6న అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. దోబీ కుల సంఘాల నాయకులు, కార్మికులను పిలిచి ఎక్స్‌పర్ట్ ట్రయల్ రన్ కూడా చేశారు. కానీ దోబీల ఆనందం ఎంతో సేపు ఉండలేకపోయింది. అదే రోజు వేసిన తాళం ఇప్పటికీ తెరుచుకోలేదు. బల్దియా, బీసీ వెల్ఫేర్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కుల సంఘం నాయకులు నిర్లక్ష్యం చేయడం వల్లనే ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో రజకులకు ప్రత్యేక రుణాలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి దోబీఘాట్ పనులు అప్పగించాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఇంకా ప్రభుత్వ వసతి గృహాలు, ఆస్పత్రులు, స్కూళ్లు, రెస్టారెంట్ల బట్టలు కూడా కాంట్రాక్ట్ పద్ధతిలో ఇక్కడే ఉతికేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. రజకుల్లో చాలామంది పెద్ద పెద్ద చదువులు చదివిన వారు నిరుద్యోగులుగా ఉన్నారని ఇక్కడ సుమారు 200 మందికి రెండు షిఫ్టులలో పనికల్పించి ఉపాధి అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే సులువుగా విలువైన బట్టలు ఉతికే దోబీ ఘాట్ సామగ్రి శిథిలావస్థకు చేరుకుంటుందని రజక సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు లక్షల రూపాయలు సంపాదించి పెట్టే పరికరాలు తుప్పుపట్టి పనికి రాకుండా పోయే పరిస్థితి ఉందని, బల్దియా అధికారులు బీసీ వెల్ఫేర్ అధికారులను పిలిచి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని రజక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని యువకుడి ఆత్మహత్య

తొర్రూరు, సెప్టెంబరు 5 : భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం తొర్రూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... దంతాలపల్లి మండలం గున్నెపల్లికి చెందిన ఎస్.కె. షరీఫ్(28) తొర్రూరులో వెల్డింగ్ షాపులో కూలీ పనిచేస్తూ నివసిస్తున్నాడు. అతడికి ఇద్దరు కమార్తెలు. మద్యానికి బానిసై తిరుగుతుండడంతో పది రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోగా మనస్థాపానికి గురై ఉరివేసుకొని చనిపోయాడు. తండ్రి జానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ట్రాక్టర్ డ్రైవర్..

డోర్నకల్, సెప్టెంబరు 5 : పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన డోర్నకల్ మండలం తోడేళ్లగూడెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం. తోడేళ్లగూడెంకు చెందిన దండుగుల వెంకన్న (45) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంత కాలంగా వెంకన్న మద్యానికి బానిసయ్యాడు. దీంతో అయన భార్య ఎల్లమ్మ ఈనెల 4న అతన్ని మం దలించడంతో ఇరువురి మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన వెంకన్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా అస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకన్న మృతి చెందాడు. మృతుడికి భార్య ఎల్లమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని తండ్రి నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానుకోట పట్టణంలో భారీ చోరీ

- 12 తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.2లక్షల నగదు అపహరించిన దుండగులు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 5: జిల్లాకేంద్రంలో బుధవారం భారీ చోరీ జరిగి 12 తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.2 లక్షల నగదు గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయిన సంఘటన చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ పట్టణం శివారు కంకరమిల్లు సమీపంలో కాలనీకి చెందిన కాసోజు బ్రహ్మచారి పురోహితుడిగా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు చెప్పారు. తన భార్య అశ్వినికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో చికిత్స నిమిత్తం గత శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లానని, వర్షాలు రావడంతో మహబూబాబాద్‌కు రాకపోకలు బంద్ కావడంతో హైదరాబాద్‌లోనే ఉన్నట్లు చెప్పారు. బుధవారం సాయంత్రం తనభార్య అశ్విని తీసుకుని ఇంటికి వచ్చానని ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూసినట్లు చెప్పారు. బీరువాలో ఉన్న 12 తులాల బంగారం, 80 తులాల వెండి అభరణాలతో పాటు రూ.2. లక్షల నగదు కన్పించకపోవడంతో ఈ విషయాన్ని వెంటనే టౌన్ పోలీసులకు సమాచారం అందించినట్లు చెప్పారు. ఘటన స్థలానికి క్లూజ్‌టీం సభ్యులు చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఆపై వేలిముద్రలను సేకరించారు. ఈ విషయంపై బాధితుడు బ్రహ్మచారి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

జీవంజి దీప్తి తొలి గురువు కన్నుమూత

ఆమెలోని క్రీడాకారిణిని గుర్తించిన వెంకటేశ్వర్లు


వెంకటేశ్వర్లు (ఫైల్)

పర్వతగిరి, సెప్టెంబరు 5: పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవంజి దీప్తి తొలి గురువు అయిన బియ్యాని వెంకటేశ్వర్లు(55) అనారోగ్యంతో బుధవారం రాత్రి కన్నుమూశారు. రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్వతగిరి మండలం కల్లెడలో నిర్వహిస్తున్న పాఠశాలలో 2000 సంవత్సరం నుంచి 2018 వరకు వ్యాయామ ఉపాధ్యాయుడిగా సేవలందించారు. ఆ సమయంలో పాఠశాల విద్యనభ్యసిస్తున్న దీప్తిలో దాగి ఉన్న క్రీడాకారిణిని గుర్తించిన వెంకటేశ్వర్లు ప్రత్యేక శిక్షణనిచ్చారు. పాఠశాల, కళాశాలస్థాయిల్లో ఆయన ఇచ్చిన శిక్షణతోనే దీప్తి పలు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించింది. అనంతరం సాయ్ అకాడమీలో శిక్షణ పొందింది. కాగా, పీఈటీ వెంకటేశ్వర్లు నాలుగేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ తన స్వగ్రామమైన బయ్యారం మండలంలోని ఇర్సులాపురంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యం విషమించి బుధవారం రాత్రి మృతిచెందారు.

కదిలిస్తున్న దీప్తి మాటలు


వెంకటేశ్వర్లుతో దీప్తి (ఫైల్)

ఇటీవల ఒక టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీప్తి తన మొదటి కోచ్ అయిన వెంకటేశ్వర్లు గురించి ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. 'వెంకటేశ్వర్లు సార్‌ది నిరుపేద కుటుంబం. నాలోని ప్రతిభను గుర్తించి ఆయన ఇచ్చిన ప్రత్యేక శిక్షణ నేను పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించగలిగా. ఒలింపిక్స్‌లో పాల్గొని మెడల్ సాధించిన తరువాత అది కళ్లారా చూసి చనిపోతానని సార్ అనేవారు' అంటూ దీప్తి ఆ ఇంటర్వ్యూలో తెలిపింది. కానీ యాధృచ్ఛికంగా నిజంగా ఆయన గతంలో దీప్తితో అన్నమాటలే నిజయమ్యాయి. దీప్తి పారాలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకున్న మరుసటి రోజునే ఆయన కన్నుమూశారు. ఈ నేపథ్యంలో దీప్తి ఓ చానల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఈ వీడియో చూసి పలువురు కన్నీటి పర్యంతమవుతున్నారు.

వరహాల గుట్టకు మహర్దశ

- ముులుగు జిల్లాలో మరో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి
- కాకతీయుల కాలం నాటి కట్టడాల గుర్తింపు
- త్వరలో గుట్టపై 40 గుడారాలు.. క్రాఫ్ట్ ఫైర్ ఏర్పాటు
- రామప్ప సరస్సుకు కూతవేటు దూరంలో కొత్త శోభ


కాకతీయుల కాలంలో ఏర్పాటు చేసిన రాళ్లగోడ

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 5: కాకతీయుల కాలంనాటి రహస్య గుట్ట.. అక్కడ వజ్ర వైడూర్యాలు ఉన్నాయా? లేదంటే కాకతీయుల కాలంనాటి రహస్య స్థావరం ఉందా? రాజులుదాచిన ఖజానా ఏమైనా ఉందా? అనే ప్రశ్నలతో పాటు మేడారం సమ్మక్క-సారలమ్మలతో యుద్ధం జరిగిన సమయంలో కాకతీయ రాజులు ఇక్కడే సేద తీరినట్లు చెబుతుంటారు. ఇలా ఎన్నో అంతుచిక్కని ప్రశ్నలు దశాబ్దాలుగా ఆ గుట్టచుట్టు తిరుగుతూనే ఉన్నాయి. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప సరస్సుకు కూతవేటు దూరంలో కనిపించే ఆ కొండపైకి ఎక్కడానికి ఈ తరం వారెవరూ అంతగా ఆసక్తి చూపరు. కానీ పైకి ఎక్కిచూస్తే చుట్టుపక్కల గ్రామాలన్నీ కనిపిస్తాయని చరిత్రకారులు చెబుతున్నారు. కాకతీయుల కాలంలో ఎడ్లబండ్లపై గుట్టపైకి వెళ్ళినట్టు ఇటీవల గుర్తించిన పలు ఆనవాళ్ల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం ఆ గుట్టపైకి ఎక్కాలంటే నడవాల్సిందే. కాకతీయుల కాలంలో రామప్ప సరస్సు ఆయకట్టు కింద కాకతీయ రాజులు తాము పండించిన ధాన్యం బందిపోట్లు లాక్కెళుతున్నారని, ధాన్యం రక్షణ కోసం గుట్టపై రహస్య స్థావరం ఏర్పరిచినట్లు కథనం ప్రకచారంలో ఉంది. దీనికి తగ్గట్లే ధాన్యం ఆరబోసేందుకు ఓ కల్లం ఏర్పాటు చేసిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి.

గుట్టపై భారీ రాళ్ల గోడ

సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వరహాల గుట్ట పైభాగంలో రాళ్లతో భారీ ప్రహరీ నిర్మించారు. తాగునీటి బావి, పచ్చళ్లు నూరడానికి రోళ్లు, బండి చక్రాలు నడిచిన ఆనవాళ్లున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. శిథిలమైన ఓ వినాయకుడి విగ్రహం కూడా గుట్టపై లభ్యమైనట్టు తెలుస్తోంది. హిందూ సంప్రదాయం ప్రకారం మొదటి పూజ వినాయకుడికి చేస్తాం కాబట్టి కాకతీ యులు కూడా ఇదే సంప్రదాయాన్ని పాటిస్తూ గుట్ట ప్రారంభ దారిలోనే వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్టు భావిస్తున్నారు. అంతే కాకుండా అంత ఎత్తులో ఉన్న గుట్టపై బావి నిర్మించి నీటిని తోడుకున్నారంటే చాలా కాలం ఇక్కడ నివసించి ఉన్నారని అర్థం చేసుకోవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇది నిర్మించింది కూడా రేచర్లే!

కాకతీయ సేనాని రేచర్ల రుద్రయ్య రామప్ప దేవాయాన్ని నిర్మించినట్టు చరిత్ర ద్వారా తెలుస్తుండగా అదేవిధంగా వరహాల గుట్టపై కాకతీయుల ఉన్నట్లు వారి అవసరాల కోసం అక్కడ అన్నీ నిర్మాణాలు చేసినట్టు భావిస్తున్నారు. కొందరు సైనిక స్థావరం కోసమని, మరికొందరు విలువైన సంపద, ఖజానా దాచుకోవడం కోసమని, ఇంకొందరు సమ్మక్క-సారక్కలతో యుద్ధం జరిగిన సమయంలో రాజులు సేద తీరడాకని, విలువైన ఆభరణాలు, ధాన్యం దాచుకోవడానికని గుట్టపై ఏర్పాట్లు చేసుకున్నారని చెబుతున్నారు. అందువల్లే ఈగుట్టకు వరహాలగుట్ట అనే పేరు వచ్చిందని భావిస్తున్నారు. కాకతీయలు నిర్మించిన ఈగుట్ట పైభాగంలో ఉన్న పురాతన సంపదనను కాపాడటంతో పాటు పర్యాటకులకు ఈ అందాలు, కాకతీయుల కాలం నాటి గుర్తులను చేరువ చేసేలా అభివృద్ధి చేయనున్నట్టు సమాచారం. మరో నెలరోజుల్లో ఈ గుట్టకు మహర్దశ వచ్చేలా చర్యలు తీసుకోబోతున్నట్టు తెలుస్తోంది.

గుట్టపై ప్రదేశంలో పర్యాటకుల కోసం గుడారాలు

అటవీశాఖ ఆధ్వర్యంలో రామప్ప సరస్సు సమీపంలో ఉన్న వరహాలగుట్టపై ఉన్న ఐదెకరాల ప్రదేశాన్ని పర్యాటక కేంద్రంగా తయారు చేసేందుకు ములుగు అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో) ఆదేశాలతో ములుగు ఫారెస్ట్ రెంజర్ డోలి శంకర్ ఆధ్వర్యంలో పర్యాటకులను ఆకర్శించే విధంగా పనులు మొదలయ్యాయి. ఈ నెలాఖరు కల్లా గుట్టపైకి పర్యాటకులను అనుమతించే అవకాశం కనిపిస్తోంది. అయితే కాలినడకన వెళ్లేందుకు మూడు మీటర్ల వెడల్పుతో గుట్టకు ఉన్న బండరాళ్ల తోనే దారి ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం రహదారి పనులు పూర్తి కావస్తుం డగా.. పనులు వేగంగా జరుగుతున్నాయి. గుట్టపై 50 గుడారాలు ఏర్పాటు చేసి వాటి ముందు భాగంలో పర్యాటకులను ఆకర్శించే విధంగా క్రాఫ్ట్ ఫైర్ (కట్టెలతో మంటలు) ఏర్పాటు చేయనున్నారు. రామప్ప సరస్సు సమీపంలోని వరహాల గుట్ట పర్యాటకంగా విరాజిల్లానుండటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


వరహాల గుట్టపైకి వేస్తున్న కాలిబాట

సరస్సు నుంచి గుట్టపైకి రోప్‌వే ఏర్పాటు చేయాలి

పూల్యాల రామన్న, టూరిజం మార్కెటింగ్ ప్రచారకర్త



కాకతీయుల చరిత్రతో పాటు మనకు అంతుచిక్కని బోలెడు విషయాలు వరహాల గుట్ట పైభాగంలోనే కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలోనూ ఈ వరహాల గుట్ట గురించి కొందరికి మాత్రమే తెలుసు. ప్రభుత్వం, పురావస్తు, పర్యాటక శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటే అంతరించిపోతున్న కాకతీయుల చరిత్రను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు అందించే అవకాశం ఉంది. దీంతో పాటు గుట్టపైకి పర్యాటకులు వెళ్లేందుకు రామప్ప సరస్సు నుంచి గుట్టపైకి రోప్‌వే ఏర్పాటు చేస్తే పర్యాటక శాఖకు, ప్రభుత్వానికి నిజంగానే 'వరాలు' కురుస్తాయి.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల స్వీకరణ




ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి, కొంక అనురాధ, జి.వెంకటయ్య

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5: వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి రాష్ట్ర స్థాయి పలువురు ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు స్వీకరించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో కొంక అనురాధ, పి.సంపత్‌కుమార్, జి.వెంకటయ్య, డాక్టర్ ఎల్. కొమురారెడ్డి తదితరులు గురువారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను స్వీకరించారు.


డాక్టర్ ఎల్.కొమురారెడ్డి

రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న వెంకట్రామిరెడ్డి, వాసం శ్రీనివాస్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ భైరు వెంకట్రామిరెడ్డి గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎంపీ కే. కేశవరావు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖా ధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


పి.సంపత్‌కుమార్

హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు డాక్టర్ వాసం శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును గురువారం అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మాత్యు లు పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఇతర ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు.


అవార్డు అందుకుంటున్న డాక్టర్ వాసం శ్రీనివాస్

ప్రకృతి వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సాహం



తాళ్లపూసపల్లిలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, వ్యవసాయ డ్రోన్‌ను ఆపరేట్ చేస్తూ పరిశీలిస్తున్న గవర్నర్

- ఈ విధానంలో సాగు కోసం రూ.1500 కోట్లు కేటాయింపు
- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి
- కేసముద్రంలో సదస్సుకు హాజరు

కేసముద్రం, సెప్టెంబరు 5 : పర్యావరణాన్ని కాపాడుకుంటూ చేసే ప్రకృతి వ్యవసాయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఈ విధానంలో సాగు కోసం రూ.1500 కోట్లు కేటాయించిందని, సహజసిద్ధ విధానంలో పండిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకున్న వారు ఆరోగ్యంగా ఉంటారని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లిలో గురువారం 'ప్రకృతి వ్యవసాయం'పై నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరయ్యారు. తొలుత గవర్నర్‌ను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఇంద్రసేనారెడ్డి తాళ్లపూసపల్లి, కల్వల గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలకు 'నమోడ్రోన్ దీదీ' పథకంలో భాగంగా మంజూరైన వ్యవసాయ డ్రోన్‌ల పనితీరును పరిశీలించారు. ఆ తర్వాత అభినవ్‌రెడ్డి ఫౌండేషన్ బాధ్యుడు సొల్లేటి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ గత వారంలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో రైతు సంక్షేమం కోసం కీలక నిర్ణయాలు తీసుకున్నారని, భూసారం వివరాలతో కూడిన 'భూమి ఆరోగ్య కార్డు'ను రూపొందించేందుకు నిర్ణయించిందని వివరించారు. ఇటీవల గుజరాత్‌లో నిర్వహించిన గవర్నర్ల సమావేశంలో ప్రధాని మోదీ చొరవతో ప్రకృతి సాగు విధానంలోని పంట ఉత్పత్తులతో వండిన భోజనాన్ని వడ్డించారని చెప్పారు. తాను పని చేస్తున్న త్రిపుర రాష్ట్రంలో కూరగాయల మొక్కల ఆకులను సైతం వంటల్లో వినియోగిస్తూ విక్రయిస్తున్నారని తెలిపారు. వ్యవసాయంలో పశువులను వినియోగించే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని అన్నారు.

భూ తాపంతోనే వరదలు

ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయ్‌రామ్

పెరిగిన రసాయన మందుల వినియోగం, వాతావరణ కాలుష్యం, భూ తాపంతోనే వరదలు, ప్రకృతి విపత్తులు వస్తున్నాయని, ఇది ఆరంభమేనని.. భవిష్యత్తులో ఇంకా ఇలాంటివి వస్తాయని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయ్‌రామ్ హెచ్చరించారు. ఈ సదస్సుకు శిక్షకుడిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సూక్ష్మపోషకాలు లేని ఆహారాన్ని తీసుకుంటున్నారని తద్వారా కాన్సర్, తదితర వ్యాధులు వస్తున్నాయని అన్నారు. ఏ జీవిని చంపకుండా అహింసా మార్గంలోనే ప్రకృతి వ్యవసాయ విధానం ఉంటుందని తెలిపారు. ప్రకృతి సాగు విధానంలో ఒక ఎకరంలో రూ.3 లక్షల ఆదాయాన్ని చూపుతానని వివరించారు. తాను పండించిన ఆహార ఉత్పత్తులతోనే తిరుపతిలో ప్రసాదం తయారు చేస్తున్నారని తెలిపారు.

ప్రకృతి ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

ప్రకృతి విధానంలో పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని సదస్సుకు హాజరైన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కోరారు. 'నమో డ్రోన్ దీదీ' పథకంలో భాగంగా మహబూబాబాద్ జిల్లాకు మూడు వ్యవసాయ డ్రోన్‌లు ఇచ్చారని, తమ నర్సంపేట నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు కూడా డ్రోన్‌లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్‌డీవో అలివేలు, రాంమోహన్‌రెడ్డి, డీఏవో విజయనిర్మల, ట్రాన్స్‌కో డీఈ విజయ్‌కుమార్, తహసీల్దార్ టి.దామోదర్, ఏవో బి.వెంకన్న పాల్గొన్నారు.

వాయిదా పడిన ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ పరీక్షలు 9న

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 5: కాకతీయ యూనివర్సిటీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ పరీక్షలను సెప్టెంబరు 9న నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పీఎస్ఎల్ సౌజన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 2న జరగాల్సిన పరీక్షలు భారీవర్షాల కారణంగా వాయిదా పడిన విషయం విదితమే. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు గతంలో ప్రకటించిన షెడ్యూల్ మేరకు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షల సమయంలో, పరీక్షల కేంద్రాల్లో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేశారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 5: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోమ టిపల్లిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసారు. గురువారం పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు రూ.31వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు బైక్స్ స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకుని నలుగురిని విచారణ నిమిత్తం కేయూ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రాజు ధృవీకరించారు.

జూడో క్రీడాకారులకు చేయూత


క్రీడాకారులకు రవాణా చార్జీల టికెట్లను అందజేస్తున్న శ్రీనివాస్

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 5: జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సెప్టెంబరు 9నుంచి 12 వరకు చెన్నైలో నిర్వహించనున్న 4వ ఖేలో ఇండియా ఉమెన్స్ సబ్ జూనియర్స్, సీనియర్స్ సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో పాల్గొననున్న జిల్లా జూడో క్రీడాకారులకు సీనియర్ క్రీడాకారుడు ఎల్.శ్రీనివాస్ రవాణాఖర్చులను అందించారు. వరంగల్ ఓ సిటీ క్రీడా మైదానంలో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూడో శిక్షణ కేంద్రాన్ని గురువారం శ్రీనివాస్ సందర్శించి క్రీడాకారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలపై ఉన్న ఆసక్తితో ఒక సీనియర్ క్రీడాకారుడిగా ప్రతిభ కలిగిన పేద క్రీడాకారులకు చేయూతనందించేందుకు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ఖేలో ఇండియా ఆధ్వర్యంలో ఓసిటీ క్రీడా మైదానంలో శిక్షణ పొందుతున్న 10మంది క్రీడాకారిణులకు చెన్నైలో నిర్వహించనున్న సౌత్‌జోన్ పోటీలకు హాజరుకానున్న నేపథ్యంలో వారు క్రీడా పోటీలకు వెళ్లి రావడానికి రైల్వే రవాణా ఖర్చులను అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీవైఎస్‌వో సత్యవాణి, ఖేలో ఇండియా జూడో కోచ్ జె.లింగమూర్తి డీఎస్‌ఏ కోచ్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మట్కా నిర్వాహకుడిపై కేసు నమోదు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 5: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌లో మట్కా నిర్వహిస్తున్న బండి రాజు నివాసంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.32 వేలు స్వాధీనం చేసుకున్నారు. చిరువ్యాపారులను మోసం చేసి బెట్టింగ్ నిర్వహిస్తున్న బండి రాజును విచారణ నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. మిల్స్‌కాలనీ పోలీసులు రాజుపై కేసు నమోదు చేసారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ ధృవీకరించారు.

వైన్‌షాపులో చోరీ

ధర్మసాగర్, సెప్టెంబరు 5: ధర్మసాగర్ మండల కేంద్రంలోని వైన్స్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం చోరీకి పాల్పడ్డారు. సిబ్బంది కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని శివ బాలాజీ వైన్స్‌షాపులో గురువారం తెల్లవారుజామున షాపునకు సంబంధించిన కిటికీలకు అమర్చిన గ్రిల్స్‌ను గడ్డపారల సహాయంతో దొంగలు తొలగించారు. ఆ తర్వాత షాపులోకి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.85,500తో పాటు రూ.2వేల విలువైన మద్యాన్ని అపహరించారు. షాపు యాజమాని శ్యాంసుందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విషజ్వరంతో యువకుడి మృతి


విజయ్ (ఫైల్)

కొత్తగూడ, సెప్టెంబరు 5: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గాంధీనగర్‌కు చెందిన ఓ యువకుడు విషజ్వరంతో గురువారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ గ్రామానికి చెందిన మల్లెల విజయ్ (30) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. గురువారం ఆయనకు జ్వరం తీవ్రత ఎక్కువ కావడంతో వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ విజయ్ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య స్వర్ణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, విజయ్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

ఎరుపెక్కిన టేకులగూడెం

- ముగిసిన మావోయిస్టు నేత మాచర్ల ఏసోబు అంత్యక్రియలు
- అంతిమయాత్రకు హాజరైన ప్రముఖులు
- ఇది బూటకపు ఎన్‌కౌంటర్ : భారతక్క

కాజీపేట, సెప్టెంబరు 5: ఎర్ర జెండాలతో టేకులగూడెం ఎరుపెక్కింది. ఎర్రజెండాల సాక్షిగా ఎన్‌కౌంటర్‌లన్నీ బూటకమే అంటూ ఫ్లెక్సీల ద్వారా ప్రజాసంఘాల నేతలు ఎండగట్టారు. ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనంటూ మానవహక్కుల సంఘాల నిలదీత పోస్టర్‌లు టేకులగూడెంలో దర్శనమిచ్చాయి. ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ రణదేవ్ దాదా అంతిమ సంస్కారాలు గురువారం రాత్రి ముగిశాయి. ఉదయం ఏసోబు పార్థీవదేహాన్ని స్వగ్రామమైన టేకులగూడెంకు కుమారుడు మాచర్ల మహేశ్ తీసుకువచ్చారు. గ్రామస్థులు,బంధువులు, మావోయిస్టు అభిమానులు, సానుభూతిపరులు తండోపతండాలుగా టేకులగూడెం వచ్చి ఏసోబు పార్థీవదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, దాస్యం వినయ్‌భాస్కర్, తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య చేరుకుని ఏసోబు పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కళాబృందాలతో అంతిమయాత్ర

జోహార్ ఏసోబన్న.. ఏసోబన్న ఆశయాలను కొనసాగిద్దాం.. నీ త్యాగం మరువం.. అంటూ కళాబృందాలు, ప్రజాసంఘాల నేతల నినాదాలతో టేకులగూడెం హోరెత్తింది. ఏసోబు అంతిమయాత్ర గురువారం ఉదయం 11:30 నిమిషాలకు ప్రారంభమైంది. కళాకారులు ఆటలాడుతూ, పాటలు పాడుతూ భారీ ర్యాలీతో అంతిమయాత్ర సాగింది. ఎస్సీ కాలనీ నుంచి ప్రారంభమైన ఈ అంతిమయాత్ర.. గ్రామంలోని అన్ని కాలనీల మీదుగా సాగింది. సాయంత్రం 5:30 నిమిషాలకు విప్లవ సంప్రదాయం ప్రకారం నివాళులర్పించి దహన సంస్కారాలు నిర్వహించారు. ఏసోబు కుమారుడు మాచర్ల మహేశ్ దహన సంస్కారాలు పూర్తిచేశారు. కాగా, ఈ అంతిమ యాత్రలో ఇంటెలిజన్స్ పోలీసులు పాల్గొని అంతిమ యాత్ర జరిగిన తీరు, హాజరైన వారి వివరాలు సేకరించినట్లు సమాచారం.


అంతిమయాత్రలో పాల్గొన్న కుటుంబీకులు

బూటకపు ఎన్‌కౌంటరే..

ఏసోబుది కచ్చితంగా బూటకపు ఎన్‌కౌంటరేనని మాజీ మావోయుస్టు భారతక్క ఆరోపించారు. అంతిమయాత్రకు హాజరైన ఆమె మాట్లాడుతూ.. మావోయిస్టులను పట్టుకుంటే పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించాలని, కానీ హత్య చేయడం దారుణమన్నారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బంధుమిత్రుల కమిటీ జాయింట్ సెక్రటరీ శాంతక్క, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమార స్వామి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జనగామ జిల్లా అధ్యక్షుడు పాకాల వెంకన్నలు మాట్లాడుతూ.. ఆదివాసీలను, గర్భిణులను బట్టలూడదీసి కాల్చడం పోలీసుల పాశవిక చర్యలు అన్నారు. బొగ్గు, ఇనుము బహుళ జాతీయులకు అంటగట్టడానికి ఖగార్ ఆపరేషన్ పేరుతో ఏసోబును బూటకపు ఎన్‌కౌంటర్ చేశారన్నారు. ఎన్‌కౌంటర్‌లన్నీ కేంద్ర ప్రభుత్వం చేసే హత్యలేనన్నారు. మూడోసారి అధికారం చేపట్టిన మోదీ, నితీష్, చంద్రబాబు నాయుడు అండతోనే ఈ ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నారు. ఇలాంటివి జరగకుండా ఇండియా కూటమి నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఏసోబు ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయాలని డిమాండ్ చేశారు.



ఏసోబు అంతిమయాత్రలో బూటకపు ఎన్‌కౌంటర్ల ఫ్లెక్సీతో పౌరహక్కుల నేతలు

తుది దశకు ట్రాక్ మరమ్మతులు

- ఇంటికన్నె వద్ద రెండు పట్టాలు సిద్ధం
- తెల్లవారుజామున డౌన్‌లైనుపై ట్రయల్‌రన్
- పాక్షికంగా రైళ్ల పునరుద్ధరణ.. కాషన్ ఆర్డర్‌తో రాకపోకలు

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 5: సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కేసముద్రం-ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్య 418 కిలోమీటరు వద్ద వరద ప్రవాహనికి ట్రాక్ ధ్వంసమైన ప్రాంతంలో మరమ్మతు పనులు తుది దశకు చేరుకున్నాయి. చెన్నై-న్యూ ఢిల్లీ గ్రాండ్ ట్రంక్ లైనుగా పేరున్న ఈ ట్రాక్‌లో నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈ మరమ్మతు పనులు దాదాపు పూర్తయ్యాయి. బుధవారమే అప్‌లైన్ సిద్ధమవగా గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయానికి డౌన్‌లైను మరమ్మతులు పూర్తిచేసి ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. దీంతో ఈ ప్రాంతంలో అప్ అండ్ డౌన్ లైన్లు రాకపోకలకు అందుబాటులోకి వచ్చాయి. ఉదయం నుంచి గోల్కొండ, కృష్ణా, ఈస్ట్‌కోస్ట్, అండమాన్, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లను అప్‌అండ్‌డౌన్ వైపుల నడిపించారు. అయితే మరమ్మతులు జరిగిన ప్రాంతంలో కాషన్ ఆర్డర్‌తో ఈ రైళ్లను నడపగా బుధవారం అప్‌లైనులో 5కిలోమీటర్ల వేగంతో వెళ్లగా, గురువారం 30 కిలోమీటర్ల వేగంతో వెళుతున్నాయి. ఇక తాజాగా అందుబాటులోకి వచ్చిన డౌన్‌లైనులో 5 కిలోమీటర్ల వేగంతోనే వెళుతున్నాయి. అయితే ఇక్కడ ట్రాక్ సిద్ధమైనప్పటికీ విజయవాడ రాయనపాడు ప్రాంతంలో రైల్వేట్రాక్ ముంపునకు గురికావడంతో ఈ మార్గంలో పలు రైళ్లను నడపడంలేదని తెలుస్తోంది. శుక్రవారం నుంచి డోర్నకల్, భద్రాచలం రోడ్, మణుగూరు ప్రాంతాల నుంచి సికింద్రాబాద్, బల్లార్ష ప్రాంతాలకు నడిచే రైళ్లను పునరుద్ధరించనున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇంకా పూర్తిస్థాయిలో మరమ్మతుల కోసం రైల్వే సిబ్బంది ఈ ప్రాంతంలో పని చేస్తూనే ఉన్నారు. ఏదేమైనా వరద తాకిడికి పూర్తిగా తెగిపోయిన రైలుకట్టను నాలుగు రోజుల పాటు తీవ్రంగా శ్రమించి రెండు ట్రాక్‌లు అందుబాటులోకి తీసుకురావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఇంటికన్నె వద్ద తెల్లవారుజామున డౌన్‌లైనులో ట్రయల్ రన్‌లో వెళుతున్న గూడ్స్


కేసముద్రం మండలం ఇంటికన్నె వద్ద మరమ్మతులు పూర్తి చేసుకొని సిద్ధమైన డౌన్ లైను

వరంగల్ మీదుగా పాక్షికంగా నడిచిన రైళ్లు

నేటి నుంచి గోల్కొండ, శాతవాహన, ఇంటర్‌సిటీ

గిర్మాజీపేట, సెప్టెంబరు 5: భారీ వర్షాలు, వరదల కారణంగా ఇంటికన్నె-కేసముంద్రం, మహబూబాబాద్-తాళ్లపూసలపల్లి మధ్య ధ్వంసమైన రైల్వేట్రాక్‌ల పునరుద్ధరణ పనులు గురువారం ఉదయానికి పూర్తయి రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. కానీ గురువారం విజయవాడ-సికింద్రాబాద్ మార్గంలో వరంగల్ మీదుగా రైళ్లు మాత్రం పాక్షికంగా నడిచాయి. సికింద్రాబాద్ - గుంటూరు, సికింద్రాబాద్-విజయవాడ మధ్య నడిచే గోల్కొండ, ఇంటర్‌సిటీ, శాతవాహన రైళ్లు రద్దవగా.. ఈ రైళ్లు శుక్రవారం నుంచి యథాతథంగా నడవనున్నాయి. ఇక విశాఖపట్టణం-మహబూబ్‌నగర్, విశాఖపట్టణం - నాందేడ్, తిరుపతి - సికింద్రాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్, గూడూరు - సికింద్రాబాద్ సింహపూరి ఎక్స్‌ప్రెస్, తిరుపతి-కరీంనగర్ ఎక్స్‌ప్రెస్, తాంబరం-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు గురువారం వరంగల్ మీదుగా వెళ్లాయి, అలాగే వరంగల్ మీదుగా వెళ్లాల్సిన కేరళ ఎక్స్‌ప్రెస్‌ను గురువారం కాజీపేట, సికింద్రాబాద్ మీదుగా దారి మళ్లించారు. అలాగే న్యూఢిల్లీ- చెన్నై, న్యూఢిల్లీ-విశాఖపట్టణం మధ్య నడిచే జీటీ, తమిళనాడు, ఏపీ ఏసీ రైళ్లను గురువారం రద్దు చేశారు. దూరప్రాంతాల నుంచి బుధవారం బయలుదేరిన కొన్ని రైళ్లు మాత్రమే గురువారం వరంగల్ మీదుగా వెళ్లాయి. శుక్రవారం నుంచి అన్ని రైళ్లు యథావిధిగా నడుస్తాయని గురువారం రాత్రి రైల్వే వర్గాలు వెల్లడించాయి.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2945	2700
పల్లికాయ (సూక)	5100	4500
పల్లికాయ (పచ్చిది)	4500	3400
పెసళ్లు	6833	4552
పత్తి	7665	5000
పసుపు (కాడి)	12759	10000
పసుపు (గోల)	12009	10009
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	18000	14000
వండర్‌హాట్ ఏసీ	15200	13000
యూఎస్341 ఏసీ	14500	11000
దేశీ ఏసీ	22000	20000
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం


మానుకోటలో రిటైర్డ్ హిందీపండిట్ ఫాతీమాజోహారబేగంను సన్మానిస్తున్న భగత్‌సింగ్ స్టడీ సర్కిల్ బాధ్యులు


మహబూబాబాద్ పట్టణంలో ఆధ్యాపకులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు


దాట్లలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్


సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న సీపీఐ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5 : జిల్లాలో విద్యావేత్త, మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదుగురు ఉపాధ్యాయులు ఎం.నాగరాజు, జి.రవీందర్‌నాయక్, బి.శంకర్, సోమ రవి, జి. మురళీలను సన్మానించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ, పెద్ది వెంకన్న, గూడూరు నాగేశ్వర్‌రావు, సోమ విష్ణువర్ధన్, చుంచు శ్రీశైలం, ఆర్.ఉపేందర్, ఎం. వెంకట్, విక్రమ్, రవి, శ్రీనివాస్, పగడయ్య, భద్రు, అలీ పాల్గొన్నారు.

● ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఉపాధ్యాయులు సోమ గోవర్ధన్, కాపరబోయిన శ్రీనివాస్, కళ్లెం వెంకట్‌రెడ్డి, కళ్లెం వీరారెడ్డి, విజయరాజ్‌లను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య, ఆకుల శంభయ్య, తండా సదానందం, బి.రవీంద్రగుప్తా, నల్లు సుధాకర్‌రెడ్డి, ఇమ్మడి కృష్ణమూర్తి, ఘనపురపు అంజయ్య, బొడ్డుపల్లి ఉపేంద్రం, దాసరి ప్రసాద్, నక్క నాగార్జున, పమ్మిరాజు, కన్నా అశోక్, ముల్లంగి వెంకట్‌రెడ్డి, దుర్గారావు, కుమార్ పాల్గొన్నారు.

● నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, అధ్యాపకులు డాక్టర్ మసూద్, బి.శ్రీనివాస్, అనిల్‌కుమార్, వినోద్‌కుమార్,హతిరాం, కాశింషా, ఎం.సుమన్, రాజశేఖరం పాల్గొన్నారు.

● భగత్‌సింగ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రిటైర్డ్ హిందీ పండిట్ ఫాతీమాజోహర బేగంను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా భగత్‌స్టడీ సర్కిల్ అధ్యక్షుడు కళ్లెం వీరారెడ్డి మాట్లాడుతూ... ఎంతో మంది విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత ఉపాధ్యాయులదని చెప్పారు. గౌరవ అధ్యక్షుడు సోమ గోవర్ధన్, కోశాధికారి కొమిరె ఉప్పలయ్య, సభ్యులు గొర్రె శ్రీనివాస్, దోసపాటి ఉప్పలయ్య, కాపరబోయిన శ్రీనివాస్, బావ్‌సింగ్, ధారవత్ వెంకన్న, పూసపాటి నాగముని పాల్గొన్నారు.

● నలంద డిగ్రీ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ, అధ్యాపకులు యూ.రవిశంకర్, బి.ఉప్పలయ్య, సీహెచ్.ప్రశాంత్, ఎండి. గౌస్‌పాషా, బి.ముత్తయ్య, ఎ.రేణుకను సన్మానించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, రామసహాయం వెంకట్‌రెడ్డి, పీవీ.ప్రసాద్, అనుమాల వెంకటేశ్వర్లు, పర్కాల రవీందర్‌రెడ్డి, డాక్టర్ నాగవాణి పాల్గొన్నారు.

● రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నలంద కళాశాల ప్రిన్సిపల్ వై.కృష్ణప్రసాద్, అధ్యాపకులు బి.ముత్తయ్యతో పాటు లెక్చరర్లు, ఉపాధ్యాయులు ఉప్పల నవత, వీరయ్య, సదయ్య, వెంకటేశం, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సతీష్, సుధాకర్, రమేష్, కృష్ణమూర్తి, శంకర్, రవి, మనోజ్‌కుమార్, బాలరాజులను సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు గూడూరు నాగేశ్వ్రరావు, డోలి సత్యనారాయణ, పి.సదానందం, నాగేందర్, శ్రీనివాస్, సత్యం, రమేష్, మహిపాల్‌రెడ్డి, నర్సింహారావు, మంగపతిరావు పాల్గొన్నారు.

● జమాండ్లపల్లి విద్యాభారతి పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కరస్పాండెంట్ తక్కెళ్లపల్లి విజితప్రభాకర్‌రావు, ప్రిన్సిపల్ నరోత్తంరెడ్డి, ఉపాధాయులు నాగరాజు, శ్రీనివాస్, రషీద్, ఇమాముద్దీన్, సుష్మితరెడ్డి, ప్రదీప, దేవేందర్, ఉమ, ప్రియాంక, కల్యాణి, రమ పాల్గొన్నారు.

● మునిసిపల్ 36 వార్డు పరిధిలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఉపాధ్యాయులు గుడిబోయిన గోపి, సూర్యప్రకాష్, మాధవ్, కల్లెం వీరారెడ్డి, వెంకటయ్య, గోవర్ధన్, నర్సింహాస్వామి, శ్రీధర్, హరిప్రసాద్, బాలాజీ, విద్యాసాగర్,వెంకటేశ్వర్లు, పెరుగు కుమార్, రమేష్ పాల్గొన్నారు.

● మహబూబాబాద్ హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉపాధ్యాయులు అవిరె సత్యనారాయణ, గుగులోతు బాలునాయక్, బీరవెల్లి నర్సింహారెడ్డి, బానోత్ హచ్యానాయక్, జంగిలి మహిపాల్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామసహాయం వెంకట్‌రెడ్డి, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, కట్ల వెంకన్న, రమేష్ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

• మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని ఎస్సీ బాలుర, బాలికల, ట్రైబల్ వెల్ఫేర్ బాలుర, బాలికల గురుకుల పాఠశాలలతో పాటు మరిపెడ హైస్కూల్, సీతారాంపురం హైస్కూల్, మోడల్ స్కూల్, ప్రభుత్వ విద్యాసంస్థల్లో గురుపుజోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులను విద్యార్థులను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• దంతాలపల్లి లోని ఉన్నత పాఠశాలతో పాటు దాట్ల, పెద్ద ముప్పారంలో పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. దాట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

• తొర్రూరులోని బాలికల ప్రాథమిక పాఠశాలలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలలో ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి మెమెంటోలను అందించారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, బిస్కట్లు పంపిణీ చేశారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు బిజ్జాల అనిల్‌కుమార్, ఇమ్మడి రాంబాబు, సాయి తేజ, నిఖిల్, రవి తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వివిధ ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులను సన్మానించారు.

• నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల , మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ పాఠశాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా పాఠశాల్లో ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు.

• కేసముద్రం విలేజి వివేకవర్ధిని హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్, ప్రిన్సిపాల్ చిర్ర నరేష్ పాల్గొన్నారు.

• చిన్నగూడూరులోని సమర్థ విద్యానికేతన్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలలో ఉపాధ్యాయులును సన్మానించారు.

• కురవి మండలం సూదనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం విద్యార్థులు హెచ్‌ఎం దారావత్ వెంకన్న, ఉపాధ్యాయులు అంజాద్‌పాషా, బాలరాజు, సారంగం, శుభ, ప్రగతి, చిన్నం ప్రదీప్‌లను ఘనంగా సన్మానించారు.

గురువుకు పాదాభివందనం చేసిన పీడీ



జిల్లా కేంద్రంలో పాఠశాల స్థాయిలో విద్యబుద్ధులు నేర్పిన గురువు గోపు సమ్మయ్యకు వ్యాయామ ఉపాధ్యాయురాలు పుష్పలీల సాక్షాత్తు పాదాభివందనం చేసి, సన్మానించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురువారం చిన్ననాటి గురువు సమ్మయ్యను పండ్లతో పాదాభివందనం చేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనాడు వారు నేర్పిన క్రమశిక్షణతో కూడిన బోధనే నేడు వ్యాయామ ఉపాధ్యాయ వృతి చేపట్టి వేలాది మంది క్రీడాకారులను తీర్చిదిద్దుతూ క్రమశిక్షణ నేర్పుతున్నానని తెలిపారు. గురువు సమ్మయ్యను సన్మానించిడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

గురువు గోపు సమ్మయ్యకు పాదాభివందనం చేస్తున్న పీడీ పుష్పలీల

వర్షాలతో విద్యుత్‌శాఖకు భారీ నష్టం

• చీఫ్ ఇంజనీర్ కెన్ గుట్ట

మరిపెడ రూరల్, సెప్టెంబరు 5 : భారీ వర్షాలకు తొర్రూరు డివిజన్‌లో విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లిందని కార్పొరేట్ కార్యాలయ చీఫ్ ఇంజనీరు (నోడల్ అధికారి) కెన్ గుట్ట గురువారం వెల్లడించారు. మండలంలోని ఉల్లేపల్లి, బీచ్‌రాజ్‌పల్లి, భూక్యాతండా, పురుషోత్తామాయగూడెం, సీతారాంతండా, బాల్నిధర్మారంతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే అత్యధింగా విద్యుత్ వ్యవస్థ చిన్నాభిన్నమైందని ఆవేదన వ్యక్తం చేశారు. నేల కొరిగిన విద్యుత్ స్తంభాలు, డీటీఆర్‌లు, పోల్స్, విరిగిన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. తొర్రూరు డివిజన్ పరిధిలో 33 కేవీ 38 స్తంభాలు, 11 కేవీ 366 స్తం భాలు పూర్తిగా విరిగిపోయాయన్నారు. 107 ట్రాన్స్‌ఫార్మర్ వరదలో మునిగిపోయిందన్నారు. స్తం భాలు, ఎరక్షన్ చేయాలన్నారు. వీటిన్నంటికి రూ.కోటి నష్టం వాటిల్లిందన్నారు. ఈ పనులను త్వరగతిన పూర్తిచేయాలని విద్యుత్ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. ఆయన వెంట డివిజనల్ ఇంజనీరు మధుసూదన్, ఏఈ పావని ఉన్నారు.

స్టేషన్ హైస్కూల్‌కు కుర్చీల బహూకరణ



కేసముద్రం స్టేషన్ జడ్పీహైస్కూల్లో కుర్చీలను బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

కేసముద్రం, సెప్టెంబరు 5 : కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలకు నల్లతీగల రవి అధ్యక్షతన కొనసాగుతున్న ఫ్రెండ్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 1993-94 పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.10వేల విలువైన 20 కుర్చీలను గురువారం హెచ్‌ఎం బి.రాజుకు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ప్రచార కార్యదర్శి రామడుగు ధర్మాచారి, కముటం స్వామి, చిర్రగోని యాకసాయిలు, బైరు గోపి, చిన్న, నర్సింగోజు ప్రభరాణి, అడప నీరజ, పీడీ కొమ్ము రాజేందర్ పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత

• అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 5 :పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో వినాయకచవితి పండుగను పురస్కరించుకుని మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాలతో ఉన్న ప్రతిమలతో జలవనరులు, జీవరాశులు కాలుష్యానికి గురై కలుషితం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మధుసూదనరాజు, కాలుష్యనియంత్రణమండలి ఏఈ సుభాష్, మునిసిపల్ కమిషనర్లు నరేష్‌రెడ్డి, శాంతకుమార్, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.


హైదరాబాద్‌లో ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు తీసుకుంటున్న దామరవంచ గురుకుల ప్రిన్సిపాల్ హేమంత్‌నాయక్

దామరవంచ ప్రిన్సిపాల్‌కు ఉత్తమ అవార్డు

గూడూరు, సెప్టెంబరు 5 : దామరవంచ గిరిజన బాలుర గురుకుల ప్రిన్సిపాల్ బి.హేమంత్‌నాయక్ గురువారం హైదరాబాద్‌లో బెస్ట్ ప్రిన్సిపల్ అవార్డును అందుకున్నారు. గిరిజన గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి, డిప్యూటీ సెక్రటరీలు డీఎస్. వెంకన్న, ఓఎస్‌డి చంద్రశేఖర్, అసిస్టెంట్ సెక్రటరీ లింగారెడ్డిల చేతుల మీదుగా అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు. పది, ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో హేమంత్‌నాయక్ ప్రధానపాత్ర పోషించారు. సాంస్కృతి కార్యక్రమాలు, క్రీడలు విద్యార్థులను ప్రోత్సహించడంతో గురుకులాల కార్యదర్శి గుర్తించి బెస్ట్ ప్రిన్సిపల్ అవార్డుకు ఎంపిక చేశారు.

గండ్లుపడ్డ కట్ట మరమ్మతులను వేగిరం చేయాలి

ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

దంతాలపల్లి, సెప్టెంబరు 5 : ఇటీవల భారీ వర్షాలకు తెగిన కట్టలు, చెరువు గండ్ల నిర్మాణాలను సత్వరమే చేపట్టాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. గురువారం కుమ్మరికుంట్ల, రేపోణీ, దాట్లలో కొట్టుకుపోయిన కట్ట, చెరువులను పరిశీలించారు. దాట్ల, రేపోణీలో కూలిపోయిన ఇళ్లను పరిశీలించి బాధితులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరుకు శ్రీకారం చేపడుతామన్నారు. ఇరిగేషన్ అధికారులు, ఎస్సారెస్పీ అధికారులు యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకోవాలన్నారు. మండల పార్టీ సీనియర్ నాయకుడు పొన్నోటి బాలాజీ, తాజామాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్, తాజామాజీ ఎంపీటీసీ సతీష్, పీఏసీఎస్ చైర్మన్ రాము, నాయకులు మురళీ, దంతాలపల్లి ఎంపీటీసీ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం..

● నర్సింహులపేట : రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ అండగా ఉంటుందని డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. వంతడుపల, నర్సింహులపేట, పెద్దనాగారం గ్రామాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద తీవ్రతకు తెగిన నర్సింహులపేట బంధం చెరువు కట్ట, వంతడుపల ముత్యాలమ్మ చెరువు కట్ట, గొల్లబంజర చెరువుకట్టలను సందర్శించి, ఆయా చెరువుల పరివాహకంలో వరద తీవ్రతతో పంట భూముల్లో పేరుకుపోయిన ఇసుక మేటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా రూ.100 కోట్ల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు జినుకల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బ సోమిరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు దస్రూనాయక్, ఇర్రి లింగారెడ్డి, దాసరోజు రాజశేఖర్, రవీందర్‌రెడ్డి, రజినీకాంత్‌రెడ్డి, మైదం మల్లయ్య, రాజేందర్, రేఖ అనిల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'రావిరాలలో ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టాలి'


మునిగలవీడులో కొట్టుకపోయిన వరి పొలాలను పరిశీస్తున్న ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్

నెల్లికుదురు సెప్టెంబరు 5 : రావిరాల గ్రామస్థులకు తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ తెలిపారు. మండలంలోని రావిరాల గ్రామంలో గురువారం నిత్యావసర వస్తువులు అందజేశారు. మునిగలవీడులో తెగిపోయి చెరువులను, నష్టపోయిన వరిపొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు భారీగా నష్టపోయారిని నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమం లో గుగులోత్ మదన్‌లాల్, చందురాజు, రాసయాకిరెడ్డి, సాయి, నల్లాని పాపారావు పాల్గొన్నారు.

వరద ముంపు బాధితులకు పరామర్శ

● కేసముద్రం : కేసముద్రం స్టేషన్ అంబేద్కర్ సెంటర్‌లో ఇటీవలె వరద నీటితో నష్టపోయిన చిరు వ్యాపారులను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ గురువారం రాత్రి పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి, గాంతి వెంకట్‌రెడ్డి, ఉప్పునూతల రమేష్, ఎండీ కాసీం, ఎలబోయిన కరుణాకర్ ఉన్నారు. అనంతరం ఎర్రగడ్డకాలనీలో ఇటీవలె మృతి చెందిన కృష్ణమూర్తి కుటుంబాన్ని హుస్సేన్‌నాయక్ పరామర్శించారు.


ముంపు బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

దాతృత్వాన్ని చాటుకున్న పోలీసులు

మరిపెడ రూరల్, సెప్టెంబరు 5 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఉల్లేపల్లి, బీచ్‌రాజ్‌పల్లి, పురుషోత్తామాయగూడెం, సీతారాం తండా, బాల్నిధర్మారం లకు చెందిన ప్రజలు అతలాకుతలంగా దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఎస్పీ సుధీరాంనాథ్‌కేకన్ అన్నారు. గురువారం ఉల్లేపల్లిలో సుమారు రూ.లక్ష విలువైన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారీ వర్షాలకు అనేక గ్రామాలు నీట మునగడమే కాకుండా పంట పొలాలు సైతం నీట మునిగాయన్నారు. దీంతో ప్రజలు నిరాశ్రయులుగా మిగిలారన్నారు. ఈ పరిస్థితి గమనించిన మరిపెడ పోలీసులు, కొంతమంది దాతలు సహకారంతో రూ.లక్ష విలువైన నిత్యావసర సరుకులను పంపిణీ చేశామన్నారు. అంతేకాకుండా బాధిత కుటుంబాల పిల్లలకు సర్టిఫికేట్స్, పట్టాదారుపాస్ పుస్తకాలు, ఎలాంటి అవసరమైనా పోలీసులను, అధికారులను సంప్రదించాలని కోరారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నూకల నరేష్‌రెడ్డి, సీఐ రాజుగౌడ్, ఎస్సైలు బొలగాని సతీష్, సంతోష్, అధికారులు పాల్గొన్నారు.

వీఎస్ లక్ష్మీపురంలో కూలిన పెంకుటిల్లు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 5 : ఇటీవల కురిసిన భారీ వర్షానికి మహబూబాబాద్‌మండలం వీఎస్.లక్ష్మీపురంలో మీసాల సోమయ్యకు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి గురువారం కూలిన మీసాల సోమయ్య పెంకుటిల్లును పరిశీలించారు. తగు నివేదికను ఎంపీడీవో రఘుపతిరెడ్డికి అందించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి తెలిపారు. కాగా, ఇల్లు కూలిపోవడంతో ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులన్ని తడిచిపోయాయని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రియుడి ఇంటి ఎదుట మౌనపోరాటం

• వంతడుపల గ్రామంలో ఘటన

• న్యాయం చేయాలని డిమాండ్

నర్సింహులపేట, సెప్టెంబరు 5 : ప్రియుని ఇంటి ఎదుట ఓ ప్రియురాలు మౌనపోరాటం చేసిన విషయం వంతడుపల గ్రామంలో గురువారం చోటు చేసుకున్నది. బాధితురాలు కల్పన కథనం ప్రకారం. వంతడుపలకు చెందిన జంపాల కల్పనకు సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన ఓ యువకుడితో తొమ్మిది మాసాల క్రితం వివాహమైంది. వీరి దాంపత్య జీవనం సజావుగా సాగుతున్నప్పటికీ వంతడుపలకు చెందిన ముండ్ల మహేష్‌తో కల్పనకు ప్రేమవ్యవహారం కొనసాగడంతో ఇద్దరు తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. భర్తను వదిలి వస్తే పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో కల్పన గ్రామానికి వచ్చింది. మహేష్ మాటలు వినివస్తే కాదుపొమ్మని మోసం చేస్తున్నాడని, న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తానని కల్పన తెలిపారు. ఈ విషయంపై ఎస్సై సురేష్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

'నష్టపోయిన వారిని ఆదుకుంటాం'

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 5 : ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకుంటామని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 19వ వార్డు పరిధిలోని కురవిగేట్ ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. అక్కడ ప్రజలతో మాట్లాడి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బంధం చెరువు వద్ద జరుగుతున్న నాలా క్లియరింగ్ పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, ఆర్ఐ కృష్ణ ప్రసాద్, వార్డు ఆఫీసర్ కృష్ణయ్య, జగన్ పాల్గొన్నారు.

జిల్లాలో 211.0 మిల్లీమీటర్ల వర్షపాతం

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 5 : జిల్లాలో గురువారం ఉదయం 8.30 గంటల వరకు 211.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున 13.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొత్తగూడలో 34.2, గంగారంలో 21.6, బయ్యారంలో 16.8, గార్లలో 21.4, డోర్నకల్‌లో 11.0, కురవిలో 8.4, మహబూబాబాద్‌లో 13.0, గూడూరులో 14.4, కేసముద్రంలో 7.2, నెల్లికుదురులో 9.4, నర్సింహులపేటలో 8.2, చిన్నగూడూరులో 6.2, మరిపెడలో 17.8, దంతాలపల్లిలో 7.4, తొర్రూరులో 8.6, పెద్దవంగరలో 5.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

లయన్‌క్లబ్ వినాయక నూతన కమిటీ ఎన్నిక


ఎంపికైన లయన్స్ వినాయక ఫ్రెండ్స్ నూతన కమిటీ

తొర్రూరు, సెప్టెంబరు5 : లయన్స్‌క్లబ్ ఆఫ్ వినాయక ఫ్రెండ్స్ 2024-2025 సంవత్సరానికి గాను నూతన కమిటీని ఎంపిక చేసినట్లు లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం డివిజన్ కేంద్రంలో జరిగిన సమావేశంలో వినాయక ఫ్రెండ్స్ నూతన కమిటీ అధ్యక్షుడిగా పద్మం యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా చిలుకమారి రామచంద్రయ్య, కోశాధికారిగా తల్లాడి హీరధర్, ఉపాధ్యక్షుడిగా బుదారపు శ్రీనివాస్‌తో పాటు మరికొంత మందిని కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. లయన్ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి వీరిచే ప్రమాణాస్వీకారం చేయించాడు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పూర్వపు గవర్నర్‌లు డాక్టర్ కె.రాజేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారావు, శ్రీదేవి, కొండ్లె ఉమేష్, కందగట్ల సోమశేఖర్, జగన్, శంకర్, సతీష్ ఉన్నారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

• మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

డోర్నకల్, సెప్టెంబరు 5 : ఆకేరు వరదలతో తీవ్రంగా నష్టపోయిన ప్రజలను, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డోర్నకల్ మండలం ముల్కలపల్లిలో ఇటీవల వరదలతో దెబ్బతిన్న పంట పొలాలు, రోడ్లు, బాధితులను గురువారం పరామర్శించారు. ఈసందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ... రైతులు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలకు వరదలకు కొన్ని కొట్టుకుపోగా మరికొన్ని పొలాల్లో ఇసుక మేటలు వేసాయని చెప్పారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్, సామినేని సతీష్, చాగర్లముడి శ్రీనివాస్, సిరికొండ బాబు, కృష్ణ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలి

గార్ల సెప్టెంబర్ 5 : తుపాన్‌తో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ. 30వేలు నష్ట పరిహారం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు జడ సత్యనారాయణ డిమాండ్ చేశారు. పంటలు నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కోరుతూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కె.రవీందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగురోజులుగా కురిసిన భారీ వర్షాలకు గ్రామాల్లో పత్తి, వరి మిర్చితోటలు పూర్తిగా దెబ్బతినడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో గౌని మల్లేశ్, గౌని భద్రయ్య, కుసిని బాబురావు, ముళ్ల రంగయ్య, మైబెల్లి, శ్రీరాములు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో చెరువుల పరిశీలన

కురవి, సెప్టెంబరు 5 : భారీ వర్షాలతో పంటనష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. భారీ వర్షంతో తెగిన కురవి మండలంలోని అయ్యగారిపల్లి, మోద్గులగూడెం, కందికొండ, సూదనపల్లి చెరువులను గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కర్నం రాజన్న, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, పోలేపాక వెంకన్న, కందుల యాకయ్య, బొల్లు వెంకన్న, చంద్రయ్య పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కొత్తగూడ, సెప్టెంబరు 5 : మండలంలోని పలు గ్రామాలలో మృతుల కుటుంబాలను గురువారం ములుగు జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పరామర్శించారు. కొత్తగూడలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు భూపతి తిరుపతి తల్లి మృతి చెందగా, భూపతి తిరుపతి కుటుంబ సభ్యులను, గాంధీనగర్‌లో మృతి చెందిన మల్లెల విజయ్ కుటుంబాన్ని ములుగు జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు, అధికార ప్రతినిధి బానోత్ జవహర్‌లాల్ నెహ్రూ, మాజీ ఎంపీటీసీ మోకాళ్ల సంతోషరాణి వెంకటేష్, నాయకులు అజ్మీరా రవి, బొల్లు రవి, రావోజీ, దేవ్‌సింగ్, వాసం వెంకన్న, ఆవుల రమేష్ పాల్గొన్నారు.

రేషన్‌షాపుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

కేసముద్రం, సెప్టెంబరు 5 : కేసముద్రం స్టేషన్‌లోని నాలుగు రేషన్ షాపులు, మహమూద్‌పట్నంలోని ఒక రేషన్‌షాపులో గురువారం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ తనిఖీలు నిర్వహించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. రేషన్ షాపుల్లోని రికార్డులను, స్టాకును, బస్తాలకు ఉన్న లేబుళ్లను టాస్క్‌ఫోర్స్ అధికారులు పరిశీలించారు. బియ్యం నాణ్యత పరిశీలన కోసం నమూనాలను సేకరించి తీసుకువెళ్లారు. వారి వెంట జిల్లా సివిల్ సప్లై అధికారులు ఉన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 5: మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమైక్య (ఇఫ్టూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బిళ్లకంటి సూర్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలో గాంధీపార్కులో గురువారం మునిసిపల్ కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి నెల ఐదో తారీఖు వరకు మునిసిపల్ కార్మికులకు వేతనాలు అందించాలని , పని భారం పెరిగినందున ప్రతి వార్డులో ఐదు నుంచి ఆరుగురి వరకు సిబ్బందని కేటాయించాలన్నారు, గత రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలన్నారు. మునిసిపల్ కార్మికులందరికి రెగ్యులరైజ్ చేసి వారికి కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యాకయ్య, రాములు, వెంకన్న, శ్రీను, బాలు, మహేందర్, సుజాత, అచ్చమ్మ, లక్ష్మి, వెంకటమ్మ పాల్గొన్నారు.